

వీఎస్టీ జంక్షన్‌లో రోడ్డుపై నిలిచిన వర్షంనీరుతో వాహనదారుల ఇబ్బందులు

రాంనగర్, బాగ్‌లింగంపల్లిలో భారీ వర్షం

● రోడ్లు జలమయం ● కూలిన చెట్లు, వంగిన విద్యుత్ స్తంభం

రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాంనగర్, బాగ్‌లింగంపల్లి ప్రాంతాల్లో సోమవారం రాత్రి కురిసిన భారీవర్షం, ఈదురు గాలులకు రోడ్లు జలమయం అయ్యాయి. పలుచోట్ల చెట్లు విరిగిపోయి విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ముఖ్యంగా వీఎస్టీ చౌరస్తా, బీఈ చౌరస్తా, ఆర్టీసీ కళాభవన్ రోడ్డు పూర్తిగా వర్షం నీటితో నిండిపోవడంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉండగా బాగ్‌లింగంపల్లి, ఆజామాబాద్‌లో చెట్ల కొమ్మలు కూలిపోవడం, విద్యుత్ స్తంభాలు వంగిపోవడంతో ఆ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో రెండు గంటల పాటు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం కురిసిన సమయంలో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడం, విద్యుత్ స్తంభాలు వంగిపోవడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు వర్షం కురిసిన సమయంలో ప్రత్యేకచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భగత్‌సింగ్ సమకాలీనతపై వ్యాసరచన పోటీలు

రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, దివంగత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని సుందరయ్య విజ్ఞాన కేంద్రం, నియో కర్సర్ ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు భగత్‌సింగ్ సమకాలీనతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తెలంగాణ ప్రజాసాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో భగత్‌సింగ్ స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ నెల 19న బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియో కర్సర్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధి ఇందిర, ఎస్‌వీకే మేనేజర్ రమణరావు పాల్గొన్నారు.

అంజనీకుమారికి కళారత్న పురస్కారం ప్రదానం



అంజనీకుమారిని పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): సిటీసివిల్ కోర్ట్ సీనియర్ సూపరింటెండెంట్, ప్రముఖ సంఘసేవకులు వీవీపీ అంజనీకుమారికి కళారత్న ధార్మిక సేవారత్న పురస్కారం బహూకరించారు. తెలంగాణ జాగృతి సమితి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం చిక్కడపల్లిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఈ పురస్కారాన్ని నిర్వాహకులు పద్మావెంకటేశ్, ప్రముఖ కవి డా.ఎన్‌కే.రాము బహూకరించారు. ఈ సందర్భంగా అనేక సంవత్సరాలుగా అంజనీకుమారి సేవా కార్యక్రమాలను అతిథులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఘర్షణ శ్రీనివాస్, దరువు అంజన్న, కృష్ణకుమారి, వెళ్లమంచి ధనలక్ష్మి, సూర్యమీనాక్షి, ప్రత్తిపాక రేవతి, చింతలపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తమాను నిర్లక్ష్యం చేయొద్దు

ముషీరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆస్తమాను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యం పొందితే నివారించవచ్చని సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ సయ్యద్ అబ్దుల్ అలీమ్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్ కేర్ ఆస్పత్రిలో ఉచిత ఆస్తమా వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో డాక్టర్ సయ్యద్ అబ్దుల్‌అలీమ్ 80 మందికి పైగా వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ... స్వేచ్ఛగా ఊపిరి తీసుకోవాలనే నినాదంతో ప్రజల్లో ఆస్తమాపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. తమకు ఆస్తమా ఉందని చాలా మందికి తెలియదని పేర్కొన్నారు. సకాలంలో ఆస్తమాను గుర్తించకుంటే ప్రాణాలకే హాని కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ కేర్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ భారతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి లోప్రెషర్ సమస్య పరిష్కరించాలి



సమస్య తెలుసుకుంటున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని బస్తీల్లో తాగునీటి సరఫరాలో లోప్రెషర్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే ప్రజలతో కలిసి జలమండలి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ హెచ్చరించారు. డివిజన్‌లోని వాల్మీకినగర్, వీవీ గిరినగర్, ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతాల్లో తాగునీటి లోప్రెషర్ సమస్య విపరీతంగా ఉందని స్థానిక ప్రజలు కార్పొరేటర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆమె ఆయా బస్తీల్లో పర్యటించి, సమస్యను పరిశీలించారు. అక్కడి నుంచే జలమండలి అధికారులకు ఫోన్‌లో మంచినీటి సరఫరాలో లోప్రెషర్ సమస్య తీవ్రతను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, వీఎస్టీ రాజు, మహమూద్, సత్తిరెడ్డి, ప్రకాష్‌యాదవ్, నర్సింహ, సాయికుమార్, నీరజ్, స్థానికులు, బస్తీమహిళలు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్ల కొమ్మల తొలగింపు

అంబర్‌పేట, మే 6 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలో సోమవారం రాత్రి కురిసిన గాలివానకు రోడ్లపై చెట్లు విరిగిపడడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ మంగళవారం ఉదయం జీహెచ్ఎంసీ హార్టికల్చర్ సిబ్బందిని పిలిపించి రోడ్డుపై తెగిపడ్డ చెట్ల కొమ్మలను తొలగింపచేశారు. ఈదురు గాలులతో వర్షం కురిసిన సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ సూచించారు. డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

బర్కత్‌పుర, మే 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని జీహెచ్ఎంసీ చెత్త తరలింపు లారీ ఢీకొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కాచిగూడ పీఎస్ ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం. చాదర్‌ఘాట్ సిగ్నల్ వద్ద రేణుకాఎల్లమ్మ ఆలయం సమీపంలో గోల్నాకకు చెందిన సిద్ధేశ్వర్(62) రోడ్డు దాటుతుండగా అదే సమయంలో జవహర్‌నగర్‌లో చెత్త డంప్‌చేసి తిరిగి వస్తున్న జీహెచ్ఎంసీ లారీ (ఏపీ31టీడీ6737) ఢీకొట్టింది. సిద్ధేశ్వర్‌కు ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు గాయపడిన వృద్ధుడిని చికిత్సకోసం ఆస్పత్రికి తరలించారు. జీహెచ్ఎంసీ చెత్త లారీ డ్రైవర్ మాపీజుల్‌షేక్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కష్టపడే వారికే నామినేటెడ్ పదవులు

కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్



ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, పరిశీలకులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

ముషీరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేసేవారికే నామినేటెడ్ పదవులు లభిస్తాయని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని కషిష్ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిలుగా ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా పరిశీలకుడు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, సహ పరిశీలకులు సిద్ధేశ్వర్, శోభారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేయలేని పనులను సీఎం రేవంత్‌రెడ్డి 16 నెలల్లో చేసి చూపించారన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేర్చుతూ ప్రజల ప్రశంసలు పొందుతుంటే, ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టి సీఎం రేవంత్‌రెడ్డి చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇందువల్లే ప్రధాని నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా కులగణనకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌ను పార్లమెంటు సమావేశాల్లో అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం శోచనీయం అన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకే దేశవ్యాప్తంగా జైబాపూ, జైభీమ్, జై సమ్‌విధాన్ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఆరు డివిజన్లను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పార్టీ నాయకులు సైనికుల్లా పనిచేయాలన్నారు.

ముషీరాబాద్‌లో సంవిధాన్ యాత్ర

ముషీరాబాద్ చౌరస్తా నుంచి జైబాపూ, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీని కాంగ్రెస్ నేతలు నిర్వహించారు. ర్యాలీ ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి మహంకాళి అమ్మ దేవాలయం మీదుగా కషిష్ ఫంక్షన్‌హాల్ వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీ అనిల్‌కుమార్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పరిశీలకుడు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, సహాయ పరిశీలకులు సిద్ధేశ్వర్, శోభారాణి, ఆరు డివిజన్ల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పదవులు కావాలంటే దరఖాస్తు చేసుకోండి

● కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా పరిశీలకుడు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

పదవులు కావాలంటే దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా పరిశీలకుడు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు. ప్రతి డివిజన్‌లో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నామన్నారు. పదవులు రాలేదని నిరాశపడొద్దని, అధిష్ఠానం తప్పనిసరిగా 'నీ కృషి'ని గుర్తించి పదవులు అప్పగిస్తుందన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నియోజకవర్గంలో అన్ని డివిజన్‌లు కాంగ్రెస్ కైవసం చేసుకోవాలని సూచించారు. సికింద్రాబాద్ జిల్లాలోని 40 డివిజన్ల స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించేలా పనిచేయాలన్నారు. అందుకు పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ సిద్ధాంతాలు, ఆశయాలను గడగడపకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పన యాదవ్, వాజీద్‌హుస్సేన్, రాష్ట్ర నాయకులు వెంకటేష్, జీఎన్ కేశవ్, గుర్రం శంకర్, నియోజకవర్గం ఏ, బీ - బ్లాక్ కమిటీ అధ్యక్షులు అంజియాదవ్, వీడీ.కృష్ణ, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు నరేందర్, మాజీ అధ్యక్షుడు సంగపాక వెంకట్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్, కార్యదర్శి రాజ్‌దీప్, ప్రధానకార్యదర్శి లింగాల శ్రీకాంత్ గౌడ్, బీ-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్, ఉపాధ్యక్షుడు మేడి సురేష్ కుమార్, పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ మోహినొద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

హాస్టళ్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి : ఆర్.కృష్ణయ్య



ప్రభుత్వచీఫ్ సెక్రటరీ రామకృష్ణారావును కలిసి వినతిపత్రం సమర్పించిన ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాలేజీ విద్యార్థుల ఫీజు బకాయిలు, బీసీ కాలేజీ హాస్టల్స్‌కు సంబంధించిన 7 నెలల మెస్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావుకు ఆయన మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల పరిధిలో 600 డిగ్రీ కాలేజీల్లో చదివే 6లక్షల మంది విద్యార్థుల హాస్టల్స్ ఫీజు బకాయిలను చెల్లించకపోవడం వల్ల వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. మెస్ బిల్లులు చెల్లించకపోవడం వల్ల హాస్టల్స్ మూతపడే పరిస్థితి నెలకొందన్నారు. హాస్టల్స్‌కు నిత్యావసర వస్తువులు సరఫరా చేసేవారు దీనిని నిలిపివేశారని, దీంతో చాలా హాస్టల్స్‌లో మెస్‌లు మూతపడ్డాయన్నారు. దీంతో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడిసిన్ చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బిల్లులను వారం లోపు పరిష్కరిస్తామని చీఫ్ సెక్రటరీ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు మల్లేష్‌యాదవ్, నీల వెంకటేష్, అంజి, సిరాజేందర్, పి.సతీష్, రామ్‌కోటి, రామమూర్తిగౌడ్, రాందేవ్, రవికుమార్, బాలయ్య పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో రాంకీ గుత్తాధిపత్యం

● బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లేశం ● సొంతగూటికి కార్మికులు, ఉద్యోగులు ● బీఎంజీఈయూలో చేరిన 100 మంది



మల్లేశం, రామ్మోహన్ సమక్షంలో చేరిన కార్మికులు, ఉద్యోగులు

చిక్కడపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో రామ్‌కీ గుత్తాధిపత్యాన్ని కొనసాగిస్తోందని బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లేశం మండిపడ్డారు. జీహెచ్ఎంసీలో కార్మిక, ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నా కూడా పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (బీఎంఎస్)లో సుమారు 100 మంది ఉద్యోగులు, కార్మికులు చేరారు. మంగళవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ ఆర్టీసీ క్రాస్‌రోడ్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో బీఎంయూ సంఘటన కార్యదర్శి ఎ.శంకర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సమావేశంలో మల్లేశం, బీఎంఎస్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి జె.రామ్మోహన్ సమక్షంలో బీఎంఎస్ కండువా కప్పుకుని 100 మంది యూనియన్‌లో చేరారు. మల్లేశం మాట్లాడుతూ గతంలో భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్‌లో పనిచేసిన కార్మికులు, ఉద్యోగులు మళ్లీ సొంతగూటికి రావడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. బీఎంఈయూ(బీఎంఎస్) అధ్యక్షులు జి.రాజేశ్వరరావు, ప్రధానకార్యదర్శి టి.కృష్ణ, నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎం జాబ్రి, ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్, కె.కృష్ణ, దేవేందర్, భిక్షపతి, అడిషనల్ జనరల్ సెక్రటరీ రాధాకృష్ణ, రూపేష్, ఆర్గనైజేషన్ కార్యదర్శి ఎ.శంకర్, ఖైరతాబాద్ జోనల్ ప్రెసిడెంట్ సుదర్శన్, జోనల్ సెక్రటరీ వెంకటేష్, శేరిలింగంపల్లి జోనల్ సెక్రటరీ డి.గణేష్, జవాన్ శంకర్‌లతోపాటు యూనియన్‌లో చేరిన నాయకులు మల్లికార్జున్, నందకిషోర్, శ్రీనివాస్‌గౌడ్, రామాంజనేయులు, నర్సింగ్‌రావు, దిలీప్‌కుమార్, సత్యనారాయణ, యాదగిరి, ప్రకాష్‌సింగ్, శ్రీకాంత్, మధు, అక్బర్, బిగ్ శ్రావణ్ భాస్కర్, పృథ్వి, జహీర్ సాయి విజయ్, అరుణ్, భిక్షపతి, పోచన్న తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ వేధిస్తోంది

భవన నిర్మాణ జయమానులు



హైకోర్టు అనుమతి, భవన నిర్మాణ అనుమతుల పత్రాలను చూపిస్తున్న శంకరయ్య, సాయికిషోర్

ముషీరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణానికి అధికారికంగా అన్ని అనుమతులు ఉన్నా జీహెచ్ఎంసీ సర్కిల్-15 టౌన్‌ప్లానింగ్ అధికారులు తమను వేధింపులకు గురిచేస్తున్నారని ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న భవన యజమానులు, సీనియర్ హైకోర్టు న్యాయవాది శంకరయ్య, సాయికిషోర్ ఆరోపించారు. మంగళవారం గంగపుత్ర కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గంతపుత్ర కాలనీలోని సర్వే నెంబర్ 180లో 1700ల గజాల స్థలంలో జీ ప్లస్ 5 భవన నిర్మాణానికి అన్ని అనుమతులు తీసుకుని న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా భవన నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. కానీ జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు దురుద్దేశంతో భవనం నిర్మించే స్థలానికి వచ్చి అకారణంగా ఆటంకాలు సృష్టిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. 'మీ భవనం కూల్చివేస్తాం, రోడ్డుకు సెట్‌బ్యాక్ లేకుండా నిర్మించారు. కొలతలు వేస్తూ' పదే పదే ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఇబ్బందులు తాళలేక సుప్రీంకోర్టు, హైకోర్టులో కేసులు వేసి అన్ని అనుమతులు తీసుకుని వారు ఇచ్చిన ఆదేశాల పత్రాలను జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు అందజేశాం. అయినా చిన్నచిన్న కారణాలను బూతద్దంలో చూపిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల వేధింపులపై జీహెచ్ఎంసీ కమిషనర్‌కు త్వరలో ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

హరినామ సంకీర్తనల నిర్వహణకు అవకాశం కల్పించాలి

అన్నమయ్య కళాక్షేత్రం పీఠాదిపతి విజయ శంకర స్వామి



కార్యక్రమంలో పాల్గొన్న విజయశంకర స్వామి, కంచర్ల శ్రీనివాస్, శివస్వామి, నరసింహాచార్యులు తదితరులు

కవాడిగూడ, మే 6 (ఆంధ్రజ్యోతి): శ్రీయాదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం యాదిరిగుట్ట ఆవరణలో (తిరుపతి తరహాలో) హరినామ సంకీర్తనల నిర్వహణకు ప్రభుత్వం వెంటనే భజన బృందాలకు అవకాశాలు కల్పించాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామి ప్రభుత్వాన్ని కోరారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో తిరుపతి తరహాలో నిత్య అఖండ హరినామ సంకీర్తన జరగాలని డిమాండ్ చేస్తూ హైందవ భక్తి కళా సమ్మేళనం, అన్నమయ్య కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయశంకర స్వామి మాట్లాడుతూ, సంకీర్తన సాంప్రదాయమే సనాతన ధర్మానికి ఊపిరి అని అన్నారు. అఖండ లక్ష్మీన రసింహస్వామికి ప్రతిరోజూ 12 గంటల పాటు అఖండ హరినామ సంకీర్తనలు చేయాలని, రోజుకు 6 బృందాలకు అవకాశం కల్పించాలన్నారు. భజనబృందంలో 15 నుంచి 20 మంది సభ్యులు ఉంటారని, వీరికి ఒకపూట అల్పాహారం, రెండుపూటలా భోజనం కల్పించాలని కోరారు. భజన బృందాలకు రెండు గదులు కేటాయించాలని, యాదగిరిగుట్టలో కళాకారుల భజన చేసుకోవడానికి శాశ్వత భజన వేదిక సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని, స్వామి వారి ఉచిత ప్రసాద ప్రత్యేక దర్శనం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జైభారత్ జాతీయ ప్రధానకార్యదర్శి రమణమూర్తి, శివస్వామి, బిర్లామందిర్ అర్చకులు లక్ష్మీనర్సింహాచార్యులు, భక్తరామదాసు వారసులు కంచర్ల శ్రీనివాస్, ఆధ్యాత్మిక ప్రవచనవేత్త దరూరి నరసింహాచార్యులు, అచల యోగిని నారాయణమమ్మ, అన్నమయ్య కళాక్షేత్రం యాదగిరి గుట్ట కన్వీనర్ శివగణేష్, అన్నమయ్య కళాక్షేత్రం నగర ఉపాధ్యక్షుడు ఎన్.మారన్నతో పాటు భక్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చైల్డ్ రైట్స్ పరిరక్షణ కమిషన్ సభ్యుడిగా వచన్‌కుమార్



సీఎం రేవంత్‌రెడ్డికి బొకే అందజేస్తున్న వచన్‌కుమార్ తదితరులు

రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర చైల్డ్‌రైట్స్ పరిరక్షణ కమిషన్ సభ్యుడిగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని విద్యానగర్ టీఆర్‌టీ నివాసి, గ్రీన్‌లెస్ సొసైటీ వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ వైస్‌చైర్మన్ బి.వచన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియామకాన్ని రాష్ట్ర ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెల్ సెక్రటరీ అనితారామచంద్రన్ ప్రకటించారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యానగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రీన్‌లెస్‌సొసైటీ ద్వారా తాము అందించిన సామాజిక సేవా కార్యక్రమాలు, పార్టీ పటిష్ఠతకు చేసిన కృషిని గుర్తించి చైల్డ్‌రైట్స్ పరిరక్షణ కమిషన్ సభ్యుడిగా గుర్తించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కమిషన్ చైర్‌పర్సన్ సునీతాదయాకర్‌రెడ్డితో కలిసి రాష్ట్రంలో బాలల హక్కుల కోసం కృషి చేస్తామన్నారు.

107వీ బస్సులను అంబర్‌పేట మీదుగా నడపాలి

బర్కత్‌పుర, మే 6 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీ.నగర్, సరూర్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే 107వీ ఆర్టీసీ బస్సులను అంబర్‌పేట మీదుగా నడపాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణ పనుల వల్ల ఈ బస్సులను ఆలీకేఫ్ చౌరస్తా, జిందాతిలిస్మాత్‌నగర్, చేనెంబర్ చౌరస్తా మీదుగా అటు సికింద్రాబాద్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు జిందాతిలిస్మాత్ కంపెనీ నుంచి గోల్నాక కొత్త బ్రిడ్జి మీదుగా దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్తున్నాయి. అయితే కంటోన్మెంట్ డిపోకు చెందిన 107జే బస్సులు దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఆలీకేఫ్ చౌరస్తా, పోలీస్‌లైన్, అంబర్‌పేట మీదుగా వెళ్తున్నాయి. అయితే దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన 107 బస్సులు మాత్రం అంబర్‌పేట వైపు రావడం లేదు. దీంతో సికింద్రాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు ఆలీకేఫ్ చౌరస్తా వరకు, దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్లే ప్రయాణికులు జిందాతిలిస్మాత్ కంపెనీ వరకు వెళ్లి బస్సులను ఎక్కాల్సి వస్తుందన్నారు. దీనివల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులు పూర్తి కావడం వల్ల అటు దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఇటు సికింద్రాబాద్ నుంచి వచ్చే 107వీ, 107జే బస్సులను శ్రీరమణచౌరస్తా, పోలీస్ లైన్, ఆలీకేఫ్ చౌరస్తా మీదుగా నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి అలా మాట్లాడడం సరికాదు



మాట్లాడుతున్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షుడు సాయిబాబా తదితరులు

రాంనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, కార్మికుల డిమాండ్ల సాధనకు నిధుల కొరత ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొనడం సరికాదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. మంగళవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ అసమర్థతలను కప్పిపుచ్చుకోవడానికి ప్రభుత్వ ఉద్యోగులకు అలవెన్స్‌లు ఇవ్వలేమని బెదిరించే ధోరణిలో మాట్లాడడం విచారకరమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం చొరవ చూపాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, ఎం.కె.బోస్, రాజేంద్రప్రసాద్, పరుశరామ్, రాజు, భానుప్రకాష్, మల్లికార్జున్, కప్పకృష్ణగౌడ్, కుమారస్వామి పాల్గొన్నారు.

సేవతోనే సంతృప్తి : అరవిందకుమార్

చిక్కడపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి లభిస్తుందని రాష్ట్ర యువజనకాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని ఆంధ్రకేఫ్ వద్ద పేదలకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత మారిశెట్టి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిషేక్‌కెన్నడీ, శీలంసత్యనారాయణ, భానుచందర్, సురేష్, బాలాజీ, నరేందర్, బాబురావు, భాస్కర్, హఫీజ్, సుబ్బారావు, గిరి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులకు గ్రేడ్ 1 వేతనాలు చెల్లించాలి'

చిక్కడపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో సీబీడీ, ఎస్‌ఎంజీ ఆర్టిజన్ కార్మికులకు గ్రేడ్ 1 వేతనాలు చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కార్మికశాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ డా.ఈ.గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఈశ్వరరావు మాట్లాడుతూ అత్యంత ప్రమాదకరమైన విద్యుత్ లైన్ల రిపేర్ పనులను చేస్తున్న ఆర్టిజన్లకు రూ.20వేల నుంచి 30 వేల వరకే వేతనాలు వస్తున్నాయన్నారు. వేతనాలు పెంచడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జంటనగరాల సంయుక్త కార్మిక కమిషనర్ సునీతాగోపాల్‌దాస్‌ను కూడా కలిసి వినతిపత్రం సమర్పించారు. యూనియన్ జేఏసీ కో కన్వీనర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చదువు, కరాటేలో రాణించిన విద్యార్థులకు సత్కారం

బర్కత్‌పుర, మే 6 (ఆంధ్రజ్యోతి): జీవీఆర్ కరాటే అకాడమిలో శిక్షణ పొందుతూ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన కరాటే విద్యార్థులకు సత్కార కార్యక్రమాన్ని కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమిలో మంగళవారం నిర్వహించారు. ఘన సంతోషిణిరెడ్డి ఇంటర్ సెకండ్ ఇయర్‌లో వెయ్యి మార్కులకు 904, ఇంటర్ మొదటి సంవత్సరంలో 470కి 463 మార్కులు సాధించిన అంకిత, ఎస్‌ఎస్‌సీలో మేధా 600కు 564 మార్కులు సాధించిన సందర్భంగా ఈ సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ మాట్లాడుతూ కరాటేతో పాటు విద్యలో కూడా ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. వీరిని తోటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని అటు కరాటే, ఇటు విద్యలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఆర్ కరాటే అకాడమి డైరెక్టర్ డాక్టర్ జీఎస్.గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీల్‌చైర్‌లు, సైకిల్, చేతికర్రలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన దృశ్యం

మార్గదర్శకంగా నిలవడం అభినందనీయం

చిక్కడపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల్లో మార్గదర్శకంగా నిలవడం అభినందనీయమని ప్రముఖ గాయని, రచయిత్రి హైమావతి భీమన్న అన్నారు. తెలంగాణ స్త్రీ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ప్రధాన నిర్వాహకుడు డా.గురజాడ శోభాపేరిందేవి పర్యవేక్షణలో మంగళవారం గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో రానున్న మదర్స్‌డేను నిర్వహించారు. ఉత్తమ మాతృమూర్తులుగా ప్రముఖ రచయిత్రి డా.ముక్తేవి భారతి, ఆంధ్రమహిళాసభ ఉపాధ్యక్షురాలు డా.లక్ష్మీసుందరి, ఉత్తమ గాయని రాజ్యలక్ష్మిని ఎంపిక చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్థికంగా అట్టడుగున ఉన్నవారికి వీల్‌చైర్లు, సైకిళ్లు, చేతి కర్రలు, నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేశారు. హైమావతి భీమన్న మాట్లాడుతూ శ్రీసేవా సంస్థను ప్రారంభించిన ఏడాదిలోపే సేవా సహకార కార్యక్రమాలను విపరీతమైన వేగంతో చేస్తూ ఈ సంస్థవారు మార్గదర్శకంగా నిలుస్తున్నారన్నారు. డా.శోభాపేరిందేవి, డి.హేమ, సంధ్య, శైలజ, అరుణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.